## మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాతని కలిసిన జూనియర్ కళాశాల అధ్యాపకులు.



మధిర జూలై 3,వుదయం ప్రతినిధి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర ప్రిన్సిపల్ జి.శంకర్,కళాశాల అధ్యాపకుల బృందం తో కలిసి శుక్రవారం మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాతని కలిసి కళాశాల సమస్యలను తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకర్ చైర్మన్తో కళాశాల గురించి కళాశాల ఆవరణ గురించి చైర్మన్ తో చర్చించారు. మునిసిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ కళాశాల ఆవరణము పరిశుభ్రంగా ఉంచడానికి మున్సిపాలిటీ తరఫున వర్కర్స్ ను పంపించి కళాశాల ఆవరణ లోని పిచ్చి మొక్కలను తొలగించుటకు సిబ్బంది ని పంపిస్తామన్నారు. కళాశాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకు బృందం మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాతను సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల సీనియర్ అధ్యాపకురాలు ఆర్ లత మరియు అధ్యాపకులు శుభారాణి, కొండలరావు,లక్మణ్ లు పాల్గొన్నారు

## ఈవీఎంల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం రెవెన్యూ శాఖ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం నిల్వ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 3 (వుదయం ప్రతినిధి) కొత్తగూడెం రెవెన్యూ శాఖ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల నిల్వ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను ప్రతి నెలా క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగానే ఈవీఎంల నిల్వ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ తీరును పరిశీలించినట్లు చెప్పారు. పరిశీలనలో భాగంగా ఈవీఎంలు, ఓటరు ధ్రువీకరణ యంత్రాలు భద్రపరిచిన భద్ర గదిని తనిఖీ చేశారు. అలాగే నిఘా చిత్రీకరణ పరికరాల నియంత్రణ గదిని సందర్శించి వాటి పనితీరు, చిత్రాల నమోదు వ్యవస్థను పరిశీలించారు. నిల్వ కేంద్రం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ కేంద్రంలోకి అనుమతించరాదని సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బందికి స్పష్టం చేశారు. అనంతరం నిల్వ కేంద్రానికి సంబంధించిన తనిఖీ నమోదు పుస్తకాలను పరిశీలించి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రెవెన్యూ విభాగ అధికారి మధు, ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు రంగ ప్రసాద్, ఎన్నికల ప్రధాన శిక్షకుడు పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకే పట్టం కట్టిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం

**సర్పంచుల సంఘం అధ్యక్షుడు మట్టయ్య**



మునగాల, జూలై 03 ( వుదయం): మునగాల మండలంలో నూతన అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన మాజీ గ్రామ సర్పంచ్, ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావును నియమించిన సందర్భంగా ఆయనకు మునగాల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు అమరబోయిన మట్టయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సముచిత గుర్తింపు కల్పిస్తూ కీలక పదవులను అప్పగించడం అభినందనీయమని అన్నారు. బీసీలను గుర్తించి అధ్యక్ష పదవిని కాసర్ల కోటేశ్వరరావుకు కట్టబెట్టిన రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు. కోటేశ్వరరావు నాయకత్వంలో మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధికి మరింత కృషి జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# "2 వేల ఏళ్ల భారత క్రైస్తవ వారసత్వాన్ని స్మరించుకుందాం"

**ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం.. బిషప్ దుర్గం ప్రభాకర్ సందేశం**



సూర్యాపేట జులాయి 3: వుదయం ప్రతినిధి భారతదేశంలో క్రైస్తవానికి 2,000 సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉందని, యేసుక్రీస్తు శాంతి సందేశాన్ని, సెయింట్ థామస్ త్యాగాన్ని స్మరించుకునే రోజే "భారతీయ క్రైస్తవ దినోత్సవం" అని తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం జూలై 3న సూర్యాపేట పట్టణం 5వ వార్డు శాంతినగర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూలై 3వ తేదీని "ఇండియన్ క్రిస్టియన్ డే" లేదా "యేసు క్రీస్తూ భక్తి దివస్"గా జరుపుకుంటున్నామని తెలిపారు. క్రీస్తుశకం 52లో క్రీస్తు శిష్యుడైన అపొస్తులుడైన తోమా భారతదేశానికి సువార్తను తీసుకువచ్చారని, కేరళలో క్రైస్తవాన్ని ప్రబోధించి క్రీ.శ. 72లో చెన్నై మైలాపూర్‌లో హతసాక్షి అయ్యారని బిషప్ ప్రభాకర్ గుర్తుచేశారు. ఆయన జ్ఞాపకార్థమే జూలై 3ను భారతీయ క్రైస్తవ దినోత్సవంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. 2021లో భారతదేశంలోని అన్ని క్రైస్తవ సంఘాల నాయకులు ఏకగ్రీవంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించారని, దీని ముఖ్య ఉద్దేశం భారతదేశ సంస్కృతిలో భాగస్వాములుగా ఉంటూ, యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, సేవా సందేశాన్ని, 2,000 సంవత్సరాల క్రైస్తవ చరిత్రను గుర్తుచేసుకోవడమేనని వివరించారు. "మొట్టమొదట క్రైస్తవ విశ్వాసంలోకి వచ్చింది బ్రాహ్మణ సహోదరులు, వారి కుటుంబ సభ్యులే. నేడు కోట్లాది మంది భారతీయులు క్రైస్తవ సన్మార్గం, శాంతి మార్గంలో నడుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కూడా ఈ రోజును సెయింట్ థామస్ డేగా జరుపుకుంటారు" అని బిషప్ ప్రభాకర్ తెలిపారు. భారతదేశ అభివృద్ధిలో, విద్య, వైద్య, సేవా రంగాల్లో క్రైస్తవ సమాజం చేస్తున్న సాంస్కృతిక సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని, అందరూ సోదరభావంతో, శాంతియుతంగా మెలగాలని ఆయన పిలుపునిచ్చారు.

## యాక్సిడెంట్ బాధితురాలి కి 'మీకోసం మేమున్నాం' టీం ఆర్థిక సాయం

చర్ల, జూలై 3: (వుదయం ప్రతినిధి) చర్ల మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన శ్రీమతి సోయం రమ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖమ్మంలోని ప్రసూన న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో 'మీకోసం మేమున్నాం' టీం ఫండ్ రైజింగ్ ద్వారా రూ.13,000 సేకరించి శుక్రవారం చర్లలోని సంస్థ కార్యాలయంలో చింతలపాటి అశోక్ గౌడ్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ ఆపద సమయంలో



అందించే చిన్న సహాయం కూడా బాధిత కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని, సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించే మనస్తత్వం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి దొడ్డి. తాతారావు, దొడ్డి. సూరిబాబు, జవ్వాది. సతీష్, కవ్వాల. రాము, సొల్లంగి. నాగేశ్వరరావు, బుధ్యావరపు. ప్రతాప్,గొట్టిపాటి. శ్రీనివాసరావు, రాంమోహన్, ఇర్పా. పెద్ద బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## రాళ్లగూడెం--లింగాపురం రహదారిపై ప్రయాణం ప్రాణసంకటమే"

**ప్రమాదకరంగా మారిన కల్వర్టు..**

చర్ల, జూలై 3: (వుదయం ప్రతినిధి) రాళ్లగూడెం నుంచి లింగాపురం వెళ్లే ప్రధాన గ్రామీణ రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత పరిస్థితి మరింత దయనీయంగా మారి, రహదారి మొత్తం బురదమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి లింగాపురం, కొత్తపల్లి, గొంపల్లి గ్రామాలకు ప్రధాన అనుసంధాన మార్గం కావడంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రైతులు యూరియా, ఎరువులు, పురుగుమందులు పొలాలకు తరలించడానికి, పండించిన ధాన్యాన్ని మిల్లులకు చేర్చడానికి ఇదే రహదారిని వినియోగిస్తున్నారు. అయితే రహదారి ప్రత్యేక గిరిజన అభివృద్ధి నిధులు రూ160.00 లక్షల అంచనా వ్యయంతో ఈ రహదారి ప్రారంభించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో పాటు, మధ్యలో ఉన్న చిన్న కల్వర్టు కూడా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వర్షపు



నీరు నిల్వ ఉండటంతో కల్వర్టు పరిస్థితి స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, ఈ రహదారికి మెటల్ పరచడం జరిగి చాలాకాలం గడుస్తున్నా , తారు వేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. పనులు ఎందుకు నిలిచిపోయాయనే విషయంపై సంబంధిత అధికారులు గానీ, కాంట్రాక్టర్ గానీ స్పష్టత ఇవ్వడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ జారిపడుతుండగా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి వాహనాలు సైతం సకాలంలో గ్రామాలకు చేరుకునే పరిస్థితి లేదని ప్రజలు చెబుతున్నారు. చిన్నపాటి వర్షానికే రహదారి బురదకూపంగా మారిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఈ రహదారి పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరవుతున్నాయని చెబుతున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలకు అత్యంత అవసరమైన రహదారుల అభివృద్ధి మాత్రం నత్తనడకన సాగుతోందని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించాలి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాళ్లగూడెం, లింగాపురం రహదారి మూడు గ్రామాల ప్రజల జీవనాధారానికి కీలకమైన మార్గం. అలాంటి రహదారి నెలల తరబడి నిర్లక్ష్యానికి గురికావడం అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎందుకు కాలయాపన చేస్తున్నారనే అంశంపై అధికారులు సమీక్షించి, వెంటనే రహదారి పనులను పూర్తి చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వతంగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తేనే ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## నూతన మండల అధ్యక్షుడిగా కాసర్ల కోటేశ్వరరావు

మునగాల, జూలై 03 ( వుదయం): మునగాల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కాసర్ల కోటేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా కాసర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రమిస్తానని అన్నారు. ఈ బాధ్యతలను తనకు అప్పగించేందుకు సహకరించిన రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.



## భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తుల పోటెత్తిన రాక

**గత ఏడాదితో పోలిస్తే జూన్ నెలలో 26,232 మంది అధికంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు**





భద్రాచలం, జూలై 3 (వుదయం ప్రతినిధి): దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి భక్తుల రాక ఏడాది ఏడాదికి పెరుగుతున్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణం, వైకుంఠ ఏకాదశి, శ్రీరామ నవమి వంటి మహోత్సవాలకు విశేష ప్రాధాన్యం ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి సాధారణ రోజుల్లో కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. జూన్ నెలలో నమోదైన దర్శన గణాంకాలు భక్తుల విశ్వాసానికి అద్దం పడుతున్నాయి. దేవస్థానం విడుదల చేసిన వివరాల ప్రకారం, గత సంవత్సరం (2025) జూన్ నెలలో మొత్తం 2,43,549 మంది భక్తులు శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకోగా, ఈ సంవత్సరం (2026) జూన్ నెలలో ఆ సంఖ్య 2,69,781 మందికి చేరుకుంది. దీంతో గత ఏడాదితో పోలిస్తే 26,232 మంది అదనంగా స్వామివారి దర్శనం చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. వేసవి సెలవులు ముగిసే దశలో కూడా భక్తుల రద్దీ ఏమాత్రం తగ్గకపోవడం విశేషంగా చెప్పుకోవచ్చు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు పెద్ద సంఖ్యలో భద్రాచలానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్నారు. ప్రతి రోజు తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంటోంది. ప్రత్యేక దర్శనం, సాధారణ దర్శనం, అర్చనలు, అభిషేకాలు, నిత్యకైంకర్యాల్లో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. స్వామివారి దర్శనంతో పాటు గోదావరి స్నానం చేసి పుణ్యఫలాన్ని పొందేందుకు అనేక మంది యాత్రికులు భద్రాచలానికి వస్తున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి వసతి, పరిశుభ్రత, ప్రసాదాల పంపిణీ, భద్రతా చర్యలను మరింత మెరుగుపరిచారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల సంఖ్యలో నమోదైన ఈ పెరుగుదలతో దేవస్థానం ఆదాయంలో కూడా వృద్ధి నమోదయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. జూన్ నెలలో నమోదైన ఈ గణాంకాలు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిపై భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక అనుబంధం రోజురోజుకూ మరింత బలపడుతోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. దేశం నలుమూలల నుంచి భక్తులు నిరంతరం తరలివస్తుండటంతో భద్రాచలం క్షేత్రం ఆధ్యాత్మిక వైభవాన్ని మరింతగా చాటుకుంటోంది.

## ఘనంగా ప్రపంచ మెకానిక్ డే

దమ్మపేట జులై 3 (వుదయం ప్రతినిధి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మ పేట మండలం దమ్మపేట తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ శుక్రవారం ఎస్కే మస్తాన్ ఆధ్వర్యంలో ప్రపంచ మెకానిక్ డే జెండా పండుగ జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించవలసిన నియమ నిబంధనలు స్పష్టంగా తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ పగడాల రాంబాబు ఆంగోతు శ్రీను మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిలబడుతూ వారి సాధక బాధలలో



మేము కూడా తోడుంటామని చెప్పడం జరిగింది. దమ్మపేట మాజీ సర్పంచ్ దారా యుగేందర్ మాట్లాడుతూ కార్మికుడు అంటేనే కష్టంతో కూడిన పని అని వారిని చిన్నచూపుగా చూడకుండా వారి బాధలలో తోడుగా ఉంటూ ఏ కష్టం వచ్చినా ముందుగా నేను ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిధులకు దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్. సర్పంచ్ రమాదేవి ఉప సర్పంచ్ శ్రీను రాంబాబు ను యూనియన్ సభ్యులందరూ కలిసి శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు లోకేష్, కడార్ల శ్రీనివాస చారి, రొక్కాల అనిల్ కుమార్, నందిగం పాండు, జానీ, బాజీ నవీన్, భాను, యూనియన్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## పుస్తకాల పేరుతో ప్రైవేటు పాఠశాలల దోపిడి

మునగాల, జూలై 03 (వుదయం): మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పుస్తకాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మొదటి తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పుస్తకాల ఫీజు పేరుతో సుమారు రూ.4 వేల వరకు తీసుకుంటున్నట్లు పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయడం వల్ల తమపై ఆర్థిక భారం పడుతోందని వారు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, స్టేషనరీ తదితర వస్తువులను తప్పనిసరిగా తమ వద్దనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని కూడా కొందరు ఆరోపించారు. ఈ విషయంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల వసూళ్లపై విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

### టిపిటిఎఫ్ నూతన అధ్యక్షులు బండారు శ్రీనివాస్ నేతృత్వంలో డి ఈ ఓ కి వినతి



సూర్యాపేట జులై 3; వుదయం ప్రతినిధి నూతనంగా ఎన్నికైన టిపిటిఎఫ్ సూర్యాపేట జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ కే. అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, జూన్ 30 నాటి విద్యార్థుల నమోదును పరిగణలోకి తీసుకొని సర్దుబాటు కొనసాగించాలి. ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో వెంటనే ఇన్‌స్ట్రక్టర్, ఆయాలను నియమించాలి. ప్రీ–ప్రైమరీ పాఠశాలలను రెండు పూటలా నిర్వహించాలి. జూలైలో రెండవ శనివారానికి బదులుగా ఆగస్టులో వచ్చే రెండో శనివారాన్ని పని దినంగా మార్పు చేయాలి. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం, సాయంకాలం స్నాక్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి.

అన్ని తరగతులకు టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్స్ త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బండారు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, జిల్లా ఉపాధ్యక్షులు సిరగాని యాకయ్య, జిల్లా కార్యదర్శులు ఎలిపెద్ది సుధాకర్ రెడ్డి, నల్ల చంద్రారెడ్డి, పోతురాజు నరసయ్య, మంచాల శ్యాం కుమార్, దామల కోటేశ్వరరావు, దీకొండ మహేష్, పోగుల రాజేందర్‌రెడ్డి, చీకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి



జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు సూచనల మేరకు, సంస్థ కార్యదర్శి వి. మాధవి లత పోచంపల్లి యం. పి డి ఒ కార్యాలయం సమావేశం మందిరములో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి మహిళా సాధికారిక హక్కులు, గృహహింస, పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు, బాలల చట్టాలు, పోక్సో చట్టం అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ సహాయ న్యాయవాదులు సాయి శ్రీనివాస్, జి. నాగరాజులు న్యాయ సేవ అధికార చట్టం, సేవలు, బాల్య వివాహ నిర్మూలన, మానవ అక్రమ రవాణ, రాజ్యాంగం మరియు హక్కులు అంశాలపై వివరించారు. పోచంపల్లి యం. పి డి ఒ విజయ, యం. పి ఒ తౌర్యా నాయక్ లు పేదరిక నిర్మూలనకై ఏర్పాటు చేయబడిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ బి. రాంబాయి , గ్రామ పంచాయతి కార్యదర్శి, మహిళలు పాల్గొన్నారు. ఆ తదుపరి దేశముఖి లోని సెయింట్ మేరీ రిహబిలిటేషన్ యూనివర్సిటీలో విద్యార్థిని, విద్యార్థులకు పోక్సో చట్టం, మాధకద్రవ్య నిషేధం, బాల్య వివాహాలు, న్యాయ సహాయం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ డా. శశి రాజ్ శేఖర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛాన్సెలర్ టి ఝాన్సి, స్కూల్ ఆఫ్ ల హెడ్ కిషోర్ బిరదర్, అసిస్టెంట్ లా ప్రొఫెసర్స్ లలిత కామేశ్వరి , గౌరవ్ చావ్ల పాల్గొన్నారు.

# కవిత అరెస్టును ఖండించిన డా. అనిల్ నాయక్.



వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి జూలై 3.

ఉద్యమకారుల భూ పోరాటానికి మద్దతుగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని టీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ బాధ్యులు డా. అనిల్ నాయక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధితుల తరఫున ప్రశ్నించే హక్కు ప్రతి ప్రజాస్వామ్య పౌరుడికి ఉందని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా, ప్రశ్నించిన నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు గుర్తింపు కార్డులు అందజేస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ప్రస్తావించే వారిపై పోలీసు చర్య[redacted] చేపట్టడం సరైన విధానం కాదని, ప్రజాస్వామ్యం[redacted] భిన్నాభిప్రాయాలను గౌరవించాలని ప్రభుత్వాన్ని డా. అని[redacted] నాయక్ కోరారు. ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కో[redacted] తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగుతుందని ఆయ[redacted]

# మీ-సేవ కేంద్రాల్లో అధిక చార్జీలు వసూలు చేయొద్దు: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్గొండ: మీ–సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన యూజర్ చార్జీలకే సేవలు అందించాలని, ప్రజల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుములు వసూలు చేయవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మీ–సేవ కేంద్రాల యజమానులు, ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ–సేవ ద్వారా అందించే సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలే అమల్లో ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో అధిక రుసుములు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే సేవలు అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక వ్యక్తికి సంబంధించిన పత్రాల స్థానంలో మరొకరి పత్రాలు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దరఖాస్తులు స్వీకరించే సమయంలో వివరాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ప్రవేశాలు, సర్టిఫికెట్లు తదితర అవసరాల కోసం మీ–సేవ కేంద్రాలను అధికంగా వినియోగిస్తారని, వారి నుంచి ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. మీ–సేవ కేంద్రాలు నిర్ణీత సమయాలను పాటించాలని, ఏవైనా కారణాల వల్ల కేంద్రాన్ని ఎక్కువ సమయం నిర్వహించాల్సి వస్తే సంబంధిత తహసీల్దార్‌కు సమాచారం అందించి ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. మిర్యాలగూడ రోడ్డులోని టూ బీహెచ్‌కే కాలనీ, గొల్లగూడ ప్రాంతాల్లో కొత్త మీ–సేవ కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు మీ–సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులకు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలను మీ–సేవ కేంద్రాల ద్వారా సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి దశరథ, మీ–సేవ జిల్లా అధికారి రాజశేఖర్, ఈడీఎం దుర్గారావు, ఏపీడీ శ్రవణ్ కుమార్, మీ–సేవ జిల్లా అధ్యక్షుడు రవి, మీ–సేవ ఆపరేటర్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షాకాల కష్టాలకు చెక్.. రూ.8.57 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్

### సూర్యాపేటలో సర్వోత్తమ్ రెడ్డి, నివేదిత శంకుస్థాపన



సూర్యాపేట జులై 3; వుదయం ప్రతినిధి సూర్యాపేట పట్టణాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 8.57 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. స్థానిక 29వ వార్డు పరిధిలో సద్దుల చెరువు వెనుక అలుగు ప్రాంతం, ఎస్.వి. డిగ్రీ కళాశాల వెనుక నుంచి ఎస్.ఆర్.ఎన్. ఫంక్షన్ హాల్ మీదుగా కొత్త ఎస్పీ కార్యాలయానికి వెళ్లే మార్గంలోని నాలాలో ఖ×ణఖీ నిధులు రూ. 857.40 లక్షలతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి, నివేదిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సూర్యాపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ విధానంలో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా చేపడతామని, మున్సిపల్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా కృషి కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ డ్రైన్ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల్లో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈ.ఈ. కిరణ్, 29వ వార్డు కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్ గౌడ్, చిలివేరు లక్ష్మి కాంతమ్మ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం రెండవ రోజున పాల్గొన్న జిల్లా కలెక్టర్




యాదాద్రి భువనగిరి జిల్లా ఐ=ణూ-- రాజు-ౘా ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో, హెట్రో గ్రూప్ సంస్థల జూ= నిధుల సహకారముతో స్వయం సహాయక సంఘాల (ౕాఎ+) మహిళా సభ్యులకు నిర్వహిస్తున్న 10 రోజుల కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. శిక్షణ కార్యక్రమం రెండవ రోజు గౌరవ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారు పాల్గొని శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల వ్యవసాయ వ్యయాలు తగ్గడంతో పాటు పనుల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 17 మండలాల నుండి ఎంపికైన 51 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. వీఱతీుఱ మరియు ఖీశ్రీఎఱఅస్త్ర ఔవఎస్త్రవ, దీవఅస్త్రుశ్రీబతీఱ సంస్థలకు చెందిన నిపుణుల బృందం డ్రోన్ ఆపరేషన్, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తదితర అంశాలపై సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందిస్తోంది. గ్రామీణ మహిళలను సాంకేతికంగా తీర్చిదిద్ది, వ్యవసాయ రంగంలో నూతన ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెట్రో గ్రూప్ సంస్థల జూ= ఎఘుఐ యన్ సుధాకర్ గారు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ రమణారెడ్డి గారు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీ రవీందర్ గారు పాల్గొని శిక్షణ పొందుతున్న సభ్యులను అభినందించారు. అలాగే అదనపు ఐ=ణూ గారు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఖీఘతీఎ), ౘాావీ (ఖీఘతీఎ), జిల్లా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్..

రాయపర్తి, జూలై 3 (వుదయం ప్రతినిధి): ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితకుటుంబాలకు అండగా నిలుస్తూ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సహాయ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారంవరంగల్ జిల్లా రాయపర్తి మండలం కోలన్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలైన కాదబోయిన బొందమ్మ, అప్పకట్ల రమేష్, గుంటుక ఎల్లమ్మ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ తరఫున ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, ఒక ఆయిల్ క్యాన్ అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తరఫున ఈ సహాయాన్ని రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు వంగళ నర్సయ్య, ఉపాధ్యక్షుడు తోట నర్సింగం, పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ చిట్యాల వెంకన్న, పార్టీ నాయకులు మాచర్ల రజిత శ్రీను, తాటికాయల దేవేంద్ర సమ్మయ్య, తోట నందు, మాచర్ల సోమనారాయణ, పనికిరా వెంకన్న, ఆరూరి బాబు, మాచర్ల రామచంద్ర, కొండ్రా వెంకన్న, ఆరూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర డిజిపి వీడియో కాన్ఫరెన్స్

### జిల్లా పోలీస్ కార్యాలయం నుండి హాజరైన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్






సూర్యాపేట జులై 3; వుదయం ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర డిజిపి శ్రీ సి.వి.ఆనంద్ ఐపిఎస్ గారు ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయిలో పోలీసు అధికారుల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల స్థితిగతులు అంతర్జాల నమోదు, సిసిటివి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ, ఈ–సాక్ష పోర్టల్ సద్వినియోగం, ఇంటి వద్ద నుండి కేసుల నమోదు, డయల్ 100 కాల్స్ పై పోలీసు స్పందన, పిర్యాదుల పట్ల పోలీసు సేవలు, కేసుల్లో నేరస్థులకు శిక్షల అమలు, కోర్టు అధికారులతో సమన్వయం, పోలీసు విధులు నిర్వహణ మొదలగు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా డిజిపి గారు మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పని చేయాలని అన్నారు, కేసుల్లో పురోగతి ప్రతి అంశాన్ని అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు, కేసులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి పోలీసు సేవలను వేగంగా అందించాలని అన్నారు. డయల్ 100 పిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పోలీసు విధులు నిర్వహణ డయల్ 100 పై స్పందన, బ్లూ కో, పెట్రో కార్ విధులు, కేసుల స్థితిగతుల అంతర్జాల నమోదులో, ఈ–సాక్షి పని తీరు మొదలగు అంశాల్లో అమలు చేస్తున్న ప్రణాళిక గురించి ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి గారితో పాటుగా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డిఎస్పీ రవి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ, క్లూస్ టీమ్ ఇన్స్పెక్టర్ నవీన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఐటి కోర్ సిబ్బంది, సిసిఎస్ సిబ్బంది, కమాండ్ అండ్ కంట్రోల్ రూం సిబ్బంది ఉన్నారు.

# నాణ్యమైన విద్యకు నిలువెత్తు నిదర్శనం.. జయ స్కూల్ విజయం

### రాష్ట్ర ద్వితీయ ర్యాంకర్ దేవిప్రియకు యాజమాన్యం అభినందన


K.DEVI PRIYA

సూర్యాపేట జులై 3; వుదయం ప్రతినిధి ఎస్ఎస్‌సీ–2026 పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాల్లో సూర్యాపేటకు చెందిన జయ స్కూల్ విద్యార్థిని దేవిప్రియ 596/600 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి సత్తా చాటింది. ఈ సందర్భంగా జయ్ స్కూల్ కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మాట్లాడుతూ, తొలుత దేవిప్రియకు 594 మార్కులు వచ్చాయని, రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేయడంతో మరో 2 మార్కులు కలిపి మొత్తం 596 మార్కులు వచ్చాయని తెలిపారు. దీంతో ఆమె రాష్ట్రంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన బోధన అందిస్తున్నామని, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర స్థాయిలో మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించేలా జయ స్కూల్ కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన దేవిప్రియను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఆమె ఉన్నత చదువుల్లోనూ ఇదే ప్రతిభను కొనసాగిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జయ స్కూల్ డైరెక్టర్లు బింగి జ్యోతి, జేల్లా పద్మాలు కూడా దేవిప్రియను అభినందించారు.

# సిహెచ్ఓ వెంకటనారాయణ సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



సత్తుపల్లి జులై 3 (వుదయం ప్రతినిధి) వేంసూర్ రైతు వేదికలో ప్రభుత్వ ఆసుపత్రి సి హెచ్ ఓ వెంకటనారాయణ వారి పదవీ విరమణ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ వగుట్ల వెంకటేశ్వరరావు లింగపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎర్ర రమేష్ మారోజు సురేష్ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ రహీం వారిని సన్మానించారు

# నూతన బిషప్‌కు ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్ ఘన సత్కారం!



?హనుమకొండ, జూలై 03 (వుదయం ప్రతినిధి) : వరంగల్ కాథలిక్ మెత్రాసన నూతన పీఠ కాపరిగా (బిషప్‌గా) నియమితులైన దుర్గంపుడి విజయపాల్ రెడ్డి పీఠాధిపత్య అభిషేక మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా నూతన పీఠ కాపరి దుర్గంపుడి విజయపాల్ ను ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... "నూతన బిషప్ విజయపాల్ మార్గదర్శకత్వంలో వరంగల్ మెత్రాసనం ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సామరస్యం, మానవతా విలువలను పెంపొందించేలా ఈ పీఠం ముందుకు సాగాలని కోరారు. సమాజ శ్రేయస్సుకు క్రైస్తవ సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయం" అని పేర్కొన్నారు. ?ఈ వైభవ మహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవ మత విశ్వాసులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ

మహాదేవపూర్ జులై 03(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండలకేంద్రంలో శుక్రవారం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారిణి డాక్టర్ సుస్మిత ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు అనుసరించి మాత్రమే ప్రథమ చికిత్స అందించాలని తెలిపారు, హైవి ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు గాని వివిధ రకాలైనటువంటి యాంటీబయాటిక్స్ [redacted]వ్వరాదని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని హెచ్చరించారు నిబంధనలను [redacted]తిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకోబడతాయని ఆర్ఎంపీలైన,హబీబ్ ఖాన్, ఆయుభోద్దీన్, [redacted]ంట్యాజ్, ముబీన్ తదితరులకు తెలిపినారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, హేమలత, [redacted]కటమ్మ పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే జి .ఎస్ .ఆర్.





భూపాలపల్లి జూలై 03 వుదయం ప్రతినిధి. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు.రేగొండ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ప్రైవేటు భవనంలో కొనసాగుతుండటంతో మరుగుదొడ్ల సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే సమాచారంతో నేరుగా పాఠశాలకు చేరుకుని పరిస్థితులను పరిశీలించారు.
ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, వెంటనే భవనం యజమానిని పిలిపించి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. విద్యార్థుల సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వెంటనే మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన చోట కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, స్నానాల కోసం నీటి నల్లాల ఏర్పాటు, డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.
రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని విద్యార్థులను ఇబ్బందులగు గురిచేస్తే సహించేది లేదని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గాంధీనగర్ వద్ద సమీకృత (ఇంటిగ్రేటెడ్) పాఠశాల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవిత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.
జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తమకు ఉన్న సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని, పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
అనంతరం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఈడబ్ల్యూఐడీసీ ఏఈ జీవన్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సర్పంచ్ మౌనిక, ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.




# టీబీ ముక్త్ భారత్‌కు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద.**

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూలై 3.వరంగల్ జిల్లాలో టీబీ నిర్మూలన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ జాతీయ కార్యక్రమాల అమలు, ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశంలో ఆమె ఈ సూచనలు చేశారు.
జిల్లాను “టీబీ ముక్త్ భారత్” లక్ష్య సాధన దిశగా తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితులు, మధుమేహం, రక్తపోటు రోగులు, టీబీ రోగుల సన్నిహితులకు తప్పనిసరిగా టీబీ నిర్ధారణ పరీక్షలు, తెమడ పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రేలు నిర్వహించాలని, అలాగే హెచ్ఐవీ పరీక్షలను కూడా విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరును జిల్లా స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులను మాత్రమే నిల్వ ఉంచి, రోగుల అవసరాలకు అనుగుణంగా మందుల వినియోగం ఉండేలా చూసి వృథాను నివారించాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రామ్ అధికారులు క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించి, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ దశల్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో డా. ఐ. ప్రకాష్, టీఎస్ఎంఐడీసీ ఈఈ ప్రసాద్, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వి .బి .జి. ఆర్ . చట్టాన్ని రద్దు చేయాలి.

**సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహణ.**



భూపాలపల్లి జూలై 3 వుదయం ప్రతినిధి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వి బి జి ఆర్ చట్టాన్ని రద్దు చేయాలని పాత విధానంలోనే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యంలోనిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్ మాట్లాడుతూ వి బి జి ఆర్ చట్టం పేరుతో ఉపాధి హామీ పథకం స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కార్మికుల హక్కులకు భంగం కలిగించే నిర్ణయాలను ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు అలాగే ఉపాధి హామీ పని దినాలను కనీసం 200 రోజులకు పెంచాలని కూలిరేకులు పెంచాలని పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లించాలని కోరారు వ్యవసాయ కార్మికులు రైతులు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడే ఉపాధి హాక్తులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్ మాట్లాతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నాం వెంటనే రద్దుచేసి గతంలో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథతన్ని యధావధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు 06 రైతులు నిరుద్యోగ యువతకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమైనదని వారు పేర్కొన్నారు ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించిన పాటు చెరువుల పూడికతీత నీటి సంరక్షణ మట్టి సంరక్షణ గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి విశేషంగా తోడపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సిఐటి రైతు సంఘం నాయకులు రాజేందర్ గట్టు శంకర్ పైడి రాజేశ్వరి లక్ష్మి రాజమ్మ సునీత సౌందర్య సమ్మక్క రవి జ్ఞానేశ్వరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ



భూపాలపల్లి జులై 03(వుదయం విలేకరి)జయశంకర్ భూపాల జిల్లా కేంద్రంలో శుక్రవారం డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు అనుసరించి మాత్రమే ప్రథమ చికిత్స అందించాలని హెచ్చరించారు, హైవి ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు గాని వివిధ రకాలైనటువంటి యాంటీబయాటిక్స్ ఇవ్వరాదని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని హెచ్చరించారు నిబంధనలను అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు జిల్లా నందు గల ఆర్.ఎం.పి ప్రథమ చికిత్స కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశీలించాలని వైద్యాధికారులను హెచ్చరించారు కార్యక్రమంలో డాక్టర్ సందీప్ ,డిడిఎం మధు పాల్గొన్నారు.

# డిసిసి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి




తొర్రూరు జూలై 3 (వుదయం ప్రతినిధి):గ్రామీణ ప్రాంత ప్రజలు డిసిసి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిసిసి బ్యాంకు మేనేజర్ ఎం.పూర్ణచందర్ కోరారు.డిసిసిబి తొర్రూరు శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో శుక్రవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ బంధు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ప్రవేశపెట్టిన రాణి రుద్రమ డిపాజిట్ పథకం కింద ఖాతాదారులకు అత్యధికంగా 8.10 శాతం అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలు బర్రెలు,గొర్రెలు, ట్రాక్టర్లు, కార్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయాలు, హౌసింగ్, ఎడ్యుకేషన్ లోన్లు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు, మహిళ సభ్యులకు లోన్లు వర్తిస్తుందన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సులభతరం చేసేందుకు ఆన్ లైన్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా లాంటి పథకాలు అందిస్తుందన్నారు. డిసిసి బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లంనేని అనిల్ రావు,బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ కాంత్, కళాజాత బృందం నిర్వాహకులు వై.రమేష్,బ్యాంకు సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాలలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



భూపాలపల్లి జులై 03(వుదయం విలేకరి)మీసేవ కేంద్రాల ద్వారా వివిధ ప్రభుత్వ సేవల కోసం దరఖాస్తు చేసుకునే వారికి కాగిత రహిత సేవలు జిల్లాలో మరింత విస్తరించనున్నాయని ఈడీఎం శ్రీకాంత్ తెలిపారు.శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో డిఆర్డీఓ బాలకృష్ణ, డీపీఎం రవిలతో కలసి మీ సేవా కేంద్రాల ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవలపై ప్రభుత్వం నూతనంగా మొబైల్ యాప్ లోనే దరఖాస్తుదారుడి వినతులను పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసిందని సూచించారు.మీసేవ కేంద్రంమండలాల వారీగా నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ మీ సేవ కేంద్రాల వివరాలు రెవెన్యూ సేవల ధ్రువీకరణ పత్రాలు, ఈబీసీ, ఓబీసీ వంటి రెవెన్యూ శాఖ సేవల వెరిఫికేషన్ కోసం ఇకపై ఎలాంటి ఫిజికల్ డాక్యుమెంట్లను సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలవరీ (ఈఎస్డీ మీసేవ) కమిషనర్ సర్క్యూలర్ జారీ చేశారని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని, క్షేత్రస్థాయి పరిశీలనకు దరఖాస్తుదారులపై భౌతిక పత్రాల సమర్పణకు ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని సూచించారు. సేవల్లో పారదర్శకత, వేగం పెంచేందుకు
మొబైల్ అప్లికేషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. జిల్లాలో గతంలో ఈ యాప్ గురించి నిర్వహకులకు, ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ మొబైల్ యాప్ విధానాన్ని కేవలం ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకే పరిమితం చేసినప్పటికీ ప్రస్తుతం దీనిని రెవెన్యూశాఖలోని అన్ని కేటగిరిల సేవలకు విస్తరించారన్నారు. ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో అధికారులు మీసేవ కేంద్రాల్లోని దర ఖాస్తు వివరాలను, ఆన్లైన్లో అప్లోడ్ చేసిన
యాప్ నూతనంగా ప్రవేశపెట్టారని తెలిపారు. దీనివల్ల తక్కువ సమయంలో ఎక్కువ వినతులు పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఈ యాప్ ను అధికారులకు ఇచ్చిందని, లాగిన్, పాస్ వర్డ్ లతో ఈ దరఖాస్తులను పరిశీలన చేసి సర్టిఫికేట్ జారీ చేయవచ్చని తెలిపారు.పత్రాలను నేరుగా మొబైల్లోనే పరిశీలించి జారీ చేయవచ్చని,
నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.దరఖాస్తుదారుల నుంచి అధికారులు పత్రాలను నేరుగా తీసుకోవద్దని జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని తహసీల్దార్లు, జీపీఓలందరికీ సీసీఎల్ ఏ తో పాటు జిల్లా యంత్రాంగం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మీసేవ కేంద్రాల నిర్వహకు లు దరఖాస్తుదారులను భౌతిక పత్రాల కోసం ఇబ్బంది పెట్టకూడదని స్పష్టం చేశారు. నిబం ధనలు తప్పితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో భీమా చేసుకుంటే కుటుంబానికి భరోసా.

**వడదెబ్బతో మృతి చెందిన వ్యక్తికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కు పంపిణీ.**

**ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ లక్ష్మణ్,**




ఖానాపురం, జులై 3 (వుదయం ప్రతినిధి):మండలంలోని భద్రతండ గ్రామ పంచాయతీకి చెందిన లావుడ్య రమేష్ ఇటీవలే వడదెబ్బతో మృతి చెందగా మృతిని కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా క్లెయిమ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ లక్ష్మణ్ మూడు లక్షల ఇరవై ఏడు వేల మూడు వందల ఇరవై ఐదు రూపాయల బీమా చెక్కును మృతుని భార్య నామిని లావుడియా యాకమ్మ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ మృతుడు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్లో భీమా చేసిన తొమ్మిది రోజులకే పాలసీదారుడు వడదెబ్బతో మృతి చెందడం జరిగిందని ఏజెంట్ డివో, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాలసీదారుడుకి బీమాను వర్తింపచేయడం అభినందనీయమని తెలుపుతూ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో బీమా చేసుకుంటే కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా భరోసాగా ఉంటుందని ప్రజలకు ఉమ్మడి జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా అధికారి వరప్రసాద్, నర్సంపేట బ్రాంచ్ సీనియర్ మేనేజర్ యాదండ్ల రాజు, నెక్కొండ మేనేజర్ కుసుమ ప్రవీణ్, డిఓ కోడం వెంకటరమణ, సంస్థ ఉద్యోగులు తక్కలపల్లి ప్రవీణ్ రావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేట సొసైటీ పర్సన్ గా బిక్షపతి.

**సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో సన్మానం.**



ఖానాపురం, జులై 3 (వుదయం ప్రతినిధి): నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహాయ సహకారంతో రాగంపేట గ్రామానికి చెందిన కావటి బిక్షపతి చెన్నారావుపేట సొసైటీ పర్సన్ గా నియమితులైన సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎలగందుల రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కావటి రమేష్,నాయకులు మీసం రవీందర్, దుగ్యాల రాజేశ్వరరావు, బొమ్మెరబోయిన మహేష్, రాజు, భాస్కర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల కూల్చివేతలా!

**పేదలు గూడు కోసం ఉద్యమించేది కమ్యూనిస్టులే**

**గుండ్ల సింగారం వంటా వార్పులో పాల్గొన్న చాడ, తక్కళ్ళపల్లి**



హనుమకొండ, జూలై 04 (వుదయం జిల్లా ప్రతినిధి) : పేదలకు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి రాగానే వారి గూడును కూల్చివేయడం దుర్మార్గమని, ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్ల కూల్చివేతలేనా అని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరిధిలోని గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇండ్ల కూల్చివేత జరిగిన విశ్రమించకుండా ఇండ్ల స్థలాలు, గూడు కోసం పేదలు చేపట్టిన భూపోరాటంలో వంటా-వార్పు కార్యక్రమానికి సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి, తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదలకు భూములు, గృహ వసతి కోసం కమ్యూనిస్టులే నిరంతరం పోరాడుతున్నారని గుర్తుచేశారు. నిరుపేదలు ఎంతో ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపిస్తే, నేడు వారి ఇండ్లను కూల్చి రోడ్డున పడేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిరుపేదలు నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేతలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అన్నారు.హనుమకొండ గుండ్ల సింగారంలో సర్వే నెంబర్లు 174,175లలో నేడు చెరువు శిఖం భూమి లేనే లేదని, గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు 1360 మందికి ఇంటి స్థలాలు ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ళుగా అక్కడ పేదలు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని అన్నారు. గుండ్ల సింగారంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇండ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, గ్రామ పెద్దలు గాదె మొగిలి, జన్ను కృష్ణ, సిపిఐ నాయకులు మాలోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భూపోరాట కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**అంకిల్ల రాజు మాదిగ.**




పరకాల, జూలై 3: (వుదయం ప్రతినిధి): జూలై 7న ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని, అలాగే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంఆర్పీఎస్ పరకాల మండల ఇన్‌చార్జి అంకిల్ల రాజు మాదిగ పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ ఉద్యమం సాగిందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో అనేక మంది యువకులు త్యాగాలు చేశారని, ఉద్యమకారులు కేసులు, జైలు శిక్షలు, నిర్బంధాలను ఎదుర్కొని వర్గీకరణ సాధించారని అన్నారు. మాదిగల ఆత్మగౌరవం, హక్కుల సాధనలో ఎంఆర్పీఎస్ కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ, జూలై 7న జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) అవగాహన కార్యక్రమం...



కోరుట్ల జులై 03 (వుదయం ప్రతినిధి) సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 ప్రకారం కోరుట్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ ఆవరణలో స్వచ్ఛ భారత్ మిషన్ పేజ్ 2 కింద ఇంటింటి చెత్త సేకరణ పై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయు విధానంపై ఎంపీడీవో వోదెల రామకృష్ణ స్థానిక గ్రామ సర్పంచ్ చిట్నేని లతా రమేష్ లతో కలిసి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు ఇందులో భాగంగా రూల్స్ 2026 ప్రకారం డస్ట్ బిన్ల వినియోగం ఆకుపచ్చ డస్ట్ బిన్ లో తడి చెత్త వంటి వ్యర్థాలు కూరగాయల తొక్కలో పండ్ల తొక్కలు ఆకులు నీలం రంగు డబ్బాలో పొడి చెత్త ప్లాస్టిక్ కాగితం గాజు లోహపు వస్తువులు కార్డుబోర్డు ఎరుపు రంగు డబ్బాలో సానిటరీ వ్యర్థం డైపర్లు సానిటరీ నాప్కిన్లు టాంపన్లు కండోమ్స్ నలుపు రంగు డబ్బా ప్రత్యేక జాగ్రత్తలు వ్యర్థం అనగా బ్యాటరీలు బల్బులు గడువు తీరిన మందులు థర్మామీటర్లు ఈ వేస్టేజీలు ఎస్ డబ్ల్యూ ఏం రూల్స్ 2026 అమరుల భాగంగా కల్లూరు గ్రామంలో నాలుగు రకాల చెత్త వేరు చేసే ఉత్తమ గృహిణికి స్వచ్ఛ కార్యకర్తలకు ఎంపీడీవో చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ తో పాటు స్థానిక సర్పంచ్ చిట్నేని లతా రమేష్ ఉపసర్పంచ్ జంగా స్వామి వార్డు సభ్యులు తరరా సునీత రామగిరి శ్రీధర్ చిట్నేని శైలజ సంఖ్య స్రవంతి గజం గంగాధర్ చిట్టినేని జగన్ వనతడుపుల పెద్దిరాజు పంచాయతీ కార్యదర్శి సరిత గ్రామ ప్రముఖులు మహిళా సంఘాల సభ్యులు స్వచ్ఛ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సీసీ రోడ్డు పనుల పర్యవేక్షణ...

**ఎంపీడీవో రామకృష్ణ...**
**కల్లూరు గ్రామ సర్పంచ్ చిట్నేని లత రమేష్**



కోరుట్ల జులై 03 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం కల్లూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులు ఏ విధంగా నడుస్తున్నాయోనని శుక్రవారం పరిశీలించిన కోరుట్ల మండల పరిషత్ అధికారి (ఎంపిడిఓ) వోదేల రామకృష్ణ స్థానిక సర్పంచ్ చిట్నేని లత రమేష్ లతో కలిసి పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ తో పాటు స్థానిక సర్పంచ్ చిట్నేనీ లత రమేష్ ఉప సర్పంచ్ జంగా స్వామి గ్రామ పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు తర్ర సునీత రామగిరి శ్రీధర్ చిట్నేనీ శైలజ సంకే స్రవంత గజం గంగాధర్ చిట్నేని జగన్ వనతడుపుల పెద్ది రాజు గ్రామ ప్రముఖులు మహిళా సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి...

- బీఎల్ఓ ల ఇంటింటి ఫారాల పంపిణీ పరిశీలిన...
- జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత
- గ్రామ సభల ద్వారా రీ సర్వే పనులు వేగవంతం చేయాలి...



మల్యాల జులై 03 (వుదయం విలేకరి) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత అధికారులను ఆదేశించారు శుక్రవారం మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో బీఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా బీఎల్ఓ లు ఓటర్లకు ఫారాల పంపిణీ వివరాల నమోదు అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్ర.స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలన్నారు ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూసర్వే రీ సర్వే సందర్భంగా మల్యాల మండలంలోని సర్వాపూర్ గ్రామంలో భూముల రీ సర్వేకు సంభందించిన అవగాహణ సదస్సు (గ్రామ సభ) నిర్వహించారు భూమి రీ సర్వే చేయుటలో చట్టం పరిదిలో ఉన్నా సర్వేయర్ అండ్ బౌండరీ యాక్ట్ 1923 గురించి సర్వే కార్యాక్రమాల గురించి సర్వే చేయు పని విదానాల గురించి ఇట్టి గ్రామ సభలో గ్రామ రైతులకు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఏడి కిషన్ ప్రసాద్ తహసీల్దార్ సంబంధిత సిబ్బంది బీఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు

# ప్లాంటేషన్ పనులను ప్రారంభించిన డిఎఫ్ఓ బాలమణి.



బెజ్జూర్ (వుదయం ప్రతినిధి ) బెజ్జూర్ రేంజ్ పరిధిలోని పాపన్నపేట బీట్ లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారిని బాలమని మొక్కలు నాటి పనులు ప్రారంభించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్లలో నాటిన మొక్కలకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకు అనుగుణంగా మొక్కలు నాటి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డి ఓ అప్పయ్య , ఎఫ్ ఆర్ ఓ శ్రావణ్ కుమార్, ఎఫ్ఎస్ఓ సఫియా బేగం ఎఫ్ బి ఓ గోపాల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) -2026 పై సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు...

**జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**



జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) -2026 కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారం నింపడంపై సందేహాల నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు జిల్లాలోని ఓటర్లు తమ ఓటరు జాబితాలో నమోదైన వ్యక్తిగత వివరాలు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) బీఎల్వో సూపర్వైజర్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్వో) ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) వివరాలతో పాటు ఎన్యూమరేషన్ ఫారం నింపే విధానంపై ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ను లేదా హెల్ప్లైన్ నంబర్ 7989193131ను సంప్రదించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని కలెక్టర్ తెలిపారు ఎస్ఐఆర్ -2026 ప్రక్రియలో ప్రతి అర్హత కలిగిన ఓటరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైతే ఎన్యూమరేషన్ ఫారాన్ని సక్రమంగా నింపి సమర్పించాలని కలెక్టర్ కోరారు ఓటర్లకు అవసరమైన సమాచారం మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్ డెస్క్ ద్వారా అధికారులు అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

# తల్లిని ఇంట్లోంచి గెంటేసిన కర్కష కొడుకు...






జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) ఎండపల్లి మండలం కొత్త పేట గ్రామానికి చెందిన గంగధరి లక్ష్మి (85) అనే వృద్ధురాలిని తన కన్న కొడుకు రాజేశం ఇంట్లోంచి గెంటి వేశాడని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. ఈ మేరకు ఆ వృద్ధ తల్లి సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయంతో ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి కోట వసంత కు ఫిర్యాదు చేయగా తల్లిదండ్రుల రక్షణ పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారు అనంతరం అ వృద్ధ తల్లి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో విలేకరులకు తన గోడు వినిపిస్తూ రోదించారు తన 5వ కొడుకు రాజేశం నేను స్వయంగా నిర్మించుకున్న ఇంట్లోంచి బలవంతంగా వెళ్ల గొట్టాడని నా పోషణ కూడా చూసుకోకుండా నా పేరిట ఉన్న పట్టాభూములను తన పేరిట పట్టా చేయాలని హింసిస్తున్నాడని నేను దత్తత ఇచ్చిన కొడుకు సురేందర్ కూతురు ప్రమీల నా గోస చూసి ఆశ్రయమిస్తే నన్ను సంరక్షణ చేయవద్దని వారిని బెదిరిస్తున్నాడని నన్ను ఇంట్లోంచి కొట్టి వెళ్ల గొట్టిన కొడుకు రాజేశంను నా ఇంటి నుంచి వెళ్ల గొట్టి నన్ను నా ఇంటిలో ఉంచాలని నా ముగ్గురు కొడుకులైన ప్రతాప్ రవీందర్ రాజేశం లు నాకు పోషణ ఖర్చుల కింద ఒక్కొక్కరి నుంచి నెలకు 5 వేల రూపాయల చొప్పున నా బ్యాంకు ఖాతాలో జమ చేయించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ వారి బృందం సహకారంతో ఆర్డీఓ కు ఫిర్యాదు చేశానని తనను ఇంటిలో నుంచి వెళ్ళగొట్టిన కొడుకు రాజేశం పై జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశానని ఆ వృద్ధురాలు ఏడుస్తూ తెలిపింది వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్ వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారి పిసి హన్మంత్ రెడ్డి వృద్ధురాలి కూతురు ప్రమీల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

# కేంద్ర విద్యాలయానికి 10 ఎకరాల భూమి కేటాయించాలి...

**నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్**

జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) జగిత్యాలలో ఏర్పాటు కానున్న కేంద్ర విద్యాలయానికి తెలంగాణ ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ తెలిపారు అయితే విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని భూ కేటాయింపును 10 ఎకరాలకు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాసినట్లు వెల్లడించారు కేంద్ర విద్యాలయ సంఘం (కేవీస్) నిబంధనల ప్రకారం 5 ఎకరాలు కనీస అవసరమే కాగా మెట్రో నగరాల వెలుపల ఉన్న కేంద్ర విద్యాలయాలకు 10 ఎకరాలు అనువైన ప్రమాణమని ఆయన పేర్కొన్నారు అదనపు భూమి ఉంటే విశాలమైన తరగతి గదులు ప్రయోగశాలలు క్రీడా మైదానాలు భవిష్యత్తు విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే అవకాశం ఉంటుందని వివరించారు జగిత్యాల జిల్లా విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం అందించాలనే ఉద్దేశంతో గతంలోనే 10 ఎకరాల భూమి కేటాయించాలని కోరిన విషయాన్ని గుర్తు చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్ విద్యార్థుల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి భూ కేటాయింపును 10 ఎకరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు

# వెంకటేశ్వర స్వామి వ్రతం...





కోరుట్ల జులై 03 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తేదీ 3 7 2026 శుక్రవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వ్రతాన్ని ఆలయ ప్రధానార్చకులు బీర్నంది నర్సింహ చారి వైదిక నిర్వహణలో నిర్వహించారు కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి దాతలుగా కోరుట్ల పట్టణానికి చెందిన తనుగుల రాజశేఖర్ మాధవి దంపతులు వ్యవహరించారు ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య ఆలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య ధర్మకర్తలు నేతి శ్రీనివాస్ కటుకం దివాకర్ కోట గంగాధర్ గోడికే రాములు చిలువెరీ విజయ్ కుమార్ చిట్యాల పద్మ భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# రెండు నెలల పాటు చేపల వేట నిషేధం...

జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) జగిత్యాల జిల్లాలోని గోదావరి నది ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్స్ లో తేదీ 01 07 2026 నుండి 31 8 2026 వరకు మత్స్యకారులు చేపల వేట చేయరాదని చేపల వేట పై నిషేధం విధించడం అయినది జూలై ఆగస్టు మాసంలలో రెండు నెలలు జనక చేపలు తల్లి చేపలు గుడ్లు పెట్టి సంతానమును చేయును కాబట్టి ఈ సమయంలో విత్తనోత్పత్తి చేసే చేపలను వేట ద్వారా చంపడం వలన చేప పిల్లల విత్తనోత్పత్తికి విఘాతం కలిగి మత్స్యకారులకు భవిష్యత్తులో చేపలు దొరకక ఉపాధి కోల్పోతారు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రెండు నెలల సమయం లో చేపల వేట పై నిషేధం విధించనైనది మత్స్యకారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచించనైనది నిషేధాజ్ఞాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని 2026 27 సంవత్సరానికి వారికి లైసెన్సులు జారీ చేయమని తెలియజేస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి తెలిపారు

# ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకొని మహిళ ప్రాణాలను కాపాడిన...

**ఏఎస్ఐ అన్వర్ బేగ్ కానిస్టేబుల్ ప్రసాద్కు డీజీపీ ప్రశంసలు...**
**నగదు రివార్డు ప్రకటింపు...**





జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) విధి నిర్వహణలో అప్రమత్తత వేగవంతమైన స్పందనతో ఓ మహిళ ప్రాణాలను కాపాడిన మెట్పల్లి పోలీస్ స్టేషన్ కు చెందిన ఏఎస్ఐ అన్వర్ బేగ్ కానిస్టేబుల్ ప్రసాద్ సేవలను రాష్ట్ర పోలీసు శాఖ అత్యున్నత స్థాయిలో గుర్తించింది ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఇద్దరు పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ నగదు రివార్డును ప్రకటించారు పోలీసు సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి మానవీయ దృక్పథం విధి పట్ల నిబద్ధతను ప్రత్యేకంగా ప్రశంసించారు ప్రజల ప్రాణ రక్షణే పోలీసుల అత్యున్నత బాధ్యత అని పేర్కొంటూ అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి వేగవంతమైన స్పందన ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు 2026 జూన్ 18న మెట్పల్లి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన దంపతుల మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ ఎస్ఆర్ఎస్పి కాలువ వద్దకు వెళ్లి ఆత్మహత్యకు ప్రయత్నించింది ఈ విషయమై డయల్ 112 ద్వారా సమాచారం అందిన వెంటనే మెట్పల్లి పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు సమాచారం అందుకున్న కేవలం 15 నిమిషాల్లోనే ఏఎస్ఐ అన్వర్ బేగ్ కానిస్టేబుల్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమర్థంగా అంచనా వేసి చాకచక్యంగా వ్యవహరించి మహిళను ఆత్మహత్యాయత్నం నుంచి రక్షించారు. అనంతరం ఆమెను సురక్షితంగా పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టారు

# రామలింగేశ్వరాలయంలో వైభవంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

**గణపతికి శాస్త్రోక్తంగా ఉపనిషత్ అభిషేకాలు, విశేష పూజలు**



ధర్మపురి జులై03(వుదయం ప్రతినిధి):ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయ మైన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. శుక్రవారం సంకష్టహర చతుర్దశి పురస్కరించుకుని ఆలయంలో వినాయ కుడికి వేద పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించా రు. గణపతి ఉపనిషత్ మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారికి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని దివ్యంగా అలంకరించి మహా మంగళ హారతి,మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభ వంగా నిర్వహించారు. భక్తుల వేదమంత్రాల ఘోషతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో విరసిల్లింది. సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు స్థానిక గ్రామస్థులు, భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు. పూజల అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్,వేదపండితు లు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ, ద్యావళ్ల సాయికుమార్,అభిషేకం పురోహితులు రాజగోపాల్,స్థానిక వేదపండితులు మదు రామ శర్మ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల జులై 03 (వుదయం ప్రతినిధి) జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామ సర్పంచ్ పరుమాల సుమలత మల్లేష్ ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసి మండలంలో తక్కల పల్లి పోలాస జాబితాపూర్ గ్రామాలలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీఅధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి ఎంపీఓ రవిబాబు సర్పంచులు మిల్కురి శంకర్ వద్లూరి లక్ష్మీ శంకర్ రెడ్డి సర్పంచుల జిల్లా ఫోరం అధ్యక్షులు బొలిశెట్టి గంగారెడ్డి మాజీ సర్పంచులు అంకం సతీష్ నారాయణ రెడ్డి చిర్ర నరేష్ హనుమాన్ రెడ్డి మహేశ్వర్ రావు నాయకులు జయరాం సురేష్ సత్తిరెడ్డి హరీష్ రాజా గౌడ్ ధనేశ్వర రావు సూర్య ప్రకాష్ కృష్ణ కందుల శేఖర్ గంగారం తిరుపతి రాజు మహేష్ రమేష్ సతీష్ వార్డు సభ్యులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

